క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో రామాలయం వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై ఐసీడీఎస్ సీడీపీవో రమణి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో లభించే చిరుధాన్యాలు, రాగి, కొర్ర, సామతో పాటు ఆకుకూరలను తీసుకోవాలని సూచించారు. దీంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



అవార్డు గ్రహీత హెచ్‌ఎం వెంకటేశ్వర్లను సన్మానిస్తున్న సిబ్బంది

మారేడుమిల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన మారేడుమిల్లి మండల దేవరపల్లి బాలురు ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం లండా వెంకటేశ్వర్లుకు పాఠశాల సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. విద్యారంగానికి ఆయన చేసిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఇటీవల పాడేరులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ చేతులు మీదగా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్నారు. ఇందుకుగాను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అయన సేవలను గుర్తు చేసుకొని ప్రశంసాపత్రంతో శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

రైతులకు విత్తనాల పంపిణీ

కూనవరం: రైతులు మినుము విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బి.వెంకమ్మ అన్నారు. మండలంలోని కూటూరు సచివాలయం పరిధిలో 100 మంది గిరిజన రైతులకు 15 క్వింటాళ్ల మినుము విత్తనాలను సోమవారం అందజేశారు. మాజీ సర్పంచ్ సీతారామయ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ రమేష్, వలంటీర్ శ్రుతి, ముత్తయ్య, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

మారేడుమిల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో జయంతి తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షిటిల్, యోగా, అథ్లెటిక్స్ తదితర రంగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో 14 నుంచి 17 సంవత్సరాల లోపు ఉన్న వారు అర్హులన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి జిల్లా స్థాయి క్రీడలకు పంపిస్తామన్నారు.

పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

మునగపాక : నాగులాపల్లి జేపీ అగ్రహారంలో సోమవారం అభయాంజనేయస్వామి పంచముఖ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన దొడ్డి శ్రీనివాసరావు సమకూర్చిన నిధులతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.


పాడి రైతులకు సూచనలు

కె.కోటపాడు: పశువులు ఈనిన రెండు నెలల సమయానికి ఎదకు రానున్నట్లు కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.భైరాగి అన్నారు. ఎదకు వచ్చే సమయంలో ఆయా పశువుకు కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్లు వేయించడం ద్వారా చూడికట్టే శాతం ఉంటుందని తెలిపారు. పశు విజ్ఞాన బడిలో భాగంగా కె.సంతపాలెంలో సోమవారం పాడి రైతులకు పెంపకంలో పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

ఆడపెయ్యిల ఉత్పత్తి పథకంలో పశువులకు రెండు డోసుల వీర్యానికి రూ.500 చెల్లించాలని తెలిపారు. ఆడపెయ్యి జన్మించని పక్షంలో రైతులు చెల్లించిన నగదు వాపసు చేస్తామన్నారు. పాడి పశువులకు పచ్చగడ్డిని ఆహారంగా అందించాలని సూచించారు.

ఆరోగ్య భాగ్యం

- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత పోషణ
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు



పెదబయలులో పౌష్టికాహారం ప్రదర్శన



గంపరాయిలో గిరిజన మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రాజేశ్వరి



వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్‌లో సరకులు

పెదబయలు: మాతా శిశు మరణాలు నిరోధించి, ఆరోగ్య వంతమైన సమాజం నిర్మాణానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్తున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోంది. 1000 రోజుల సంరక్షణ కార్యక్రమంతో పాటుగా పోషణ పక్వాడ్ కార్యక్రమం చేపట్టింది. అల్లూరి జిల్లాలో 3,214 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలు కలిపి 1,29,000 మంది ఉన్నారు. గత నెల నుంచి పెదబయలు ప్రాజెక్టు పరిధిలో పోషణ పక్వాడా కార్యక్రమం జరుగుతుంది. పెదబయలు 193 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం అమలవుతుంది. ఇందులో భాగంగా గ్రోత్ మానిటరింగ్ డ్రైవ్, పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించడం, పోషక విలువలు పెంపొందించడానికి బాలామృతంతో పాటుగా ఇతర వంటకాలతో తల్లులకు అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన వంటల పోటీలు నిర్వహిస్తున్నారు. గర్భిణిలు, బాలింతలు 7 నుంచి 24 నెలల పిల్లలకు సందర్శన, ఇళ్లకు ఉమ్మడి గృహ సందర్శన కార్యక్రమం చేపడుతున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పౌష్టికాహార ప్రదర్శన కార్యక్రమం, ప్రాజెక్టు పరిధిలో రక్తహీనత శిబిరాలు నిర్వహించడ ఇతర కార్యక్రమాలు చేపడుతున్నారు. మండలంలో గర్భిణులు–713, బాలింతలు–745, 3 నుంచి 24 నెలల వయస్సు కలిగిన 5,738 మంది చిన్నారులున్నారు. వారికి వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్య సలహాలు, పౌష్టికాహారం పంపిణీకి చర్యలు తీసుకుంటున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. మాతాశిశు మరణాలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్‌లను అందజేస్తున్నారు. కిట్‌లో భాగంగా గోధుమపిండి, రాగులు, ఎండు కర్జూరం, చెక్కీలు, బెల్లం తదితర సరకులను అందజేస్తోంది. దీంతో పాటు తాజా ఆకుకూరలు, తృణధాన్యాల ప్రాధాన్యతపై అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

ప్రీస్కూల్ నిర్వహణ

అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 24 నెలల వయస్సు కలిగిన పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను ప్రీస్కూల్ అందిస్తున్నారు. తెలుగు, గణితం, అంకెలు, ఇంగ్లిష్ అక్షరాలు నేర్పించే కార్యక్రమం చేపడుతున్నారు.దీంతో గతంలో కంటే అంగన్‌వాడీ కేంద్రాలకు వెలుతున్న చిన్నారులపై ప్రభుత్వం ప్రత్యేక దష్టి పెట్టింది. దీంతో పిల్లలు మరింత చురుగ్గా అవుతున్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



గతంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అరకొరగానే సరకులు అందేవి. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మాతా శిశు మరణాల నిరోధించేందుకు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషన్ కిట్లు అందజేస్తోంది. పోషణ పక్వాడా కార్యక్రమం ద్వారా కేంద్రం పరిధిలో ఇంటింటికి వెళ్లి ఆరోగ్య విషయాలు వివరించే అవకాశం కలుగుతుంది.

–ఎస్.రూపవతి, అంగన్‌వాడీ కార్యకర్త, పెదబయలు గ్రామం

మాతాశిశు మరణాల నిరోధానికి చర్యలు

జిల్లాలో 3214 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మూడు నెలల గర్భవతి నుంచి బిడ్డపుట్టి 24 నెలల వరకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుంది.గర్భతులు, బాలింతలకు ప్రత్యేక పోషణతో పాటుగా కేంద్రాల్లో ప్రతీ రోజు పౌష్టికాహారం అందిస్తున్నాం. దీంతో పాటు వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పోషణ పక్వాడ్‌తో పాటుగా 1000 రోజుల కార్యక్రమం అన్ని కేంద్రాల్లో నిరంతరం అమలు జరుగుతుంది. పుట్టిన ప్రతీ బిడ్డ మూడు కిలోల బరువు పైబడి ఆరోగ్యంగా ప్రసవం కోసం ప్రత్యేక మెనూ అందించడం జరుగుతుంది. సద్వినియోగం సరిగ్గా చేసుకుంటే మంచి ఫలితాలు వస్తుంది. అలాగే ఆస్పత్రి కాన్పుల సంఖ్య పెరిగింది. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– సూర్యలక్ష్మి,పీడీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఏఎస్ఆర్ జిల్లా

మన్యంలో చవితి సందడి

గణనాథుని విగ్రహాల అమ్మకాలు ప్రారంభం



పాడేరులో అమ్మకానికి సిద్ధం చేసిన గణనాథుని విగ్రహాలు

సాక్షి,పాడేరు : తెలుగు ప్రజల తొలి పండగ వినాయక చవితి సమీపించడంతో ముందస్తుగానే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోని మార్కెట్లలోను వినాయకుని విగ్రహాల సందడి నెలకొంది. జిల్లా కేంద్రం పాడేరుకు ఈ ఏడాది కూడా పెద్ద సైజులో గణనాథుని విగ్రహాలు చేరుకున్నాయి.పాడేరులోని ఎస్‌బీఐ జంక్షన్, పాతబస్టాండ్ ప్రాంతాల్లో వినాయకుని భారీ విగ్రహాలను అమ్మకాలకు సిద్ధం చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వ్యాపారులు అధికంగా తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్నారు.12 అడుగుల విగ్రహం రూ.20వేల వరకు ధర పలుకుతుంది. వినాయక విగ్రహాలు రూ.2వేల ధర నుంచి అందుబాటులో ఉన్నాయి. గ్రామాల్లో వినాయకచవితి ఘనంగా నిర్వహించే ఆచారం ఉండడంతో భారీ సైజ్‌లోని విగ్రహాలనే వినియోగిస్తుంటారు. ప్రస్తుతం పలు ఆకారాల్లో ఉన్న గణనాథుని విగ్రహాలను పరిశీలించి ముందస్తుగానే అడ్వాన్స్ చెల్లించి తయారు చేయిస్తున్నారు. పోటాపోటిగానే వ్యాపారులు గణనాథుని విగ్రహాలను అమ్ముతున్నారు. అరకులోయ, చింతపల్లి, సీలేరు, కొయ్యూరు, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, రంపచోడవరం, చింతూరు వంటి ప్రధాన కేంద్రాల్లో భారీ గణనాథుని విగ్రహాలను వ్యాపారులు అమ్మకాలు ప్రారంభించారు. చిన్న సైజులో మట్టి గణనాధుని విగ్రహాలు కూడా వ్యాపారులు అందుబాటులో తెచ్చారు.

అరకులోయలో నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

అరకులోయ: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో కిరసాని శ్యాంసుందరం సేవా ఆర్గనైజింగ్ సేవా సంస్థ ద్వారా మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ నేత, అరకు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిరసాని రాందాస్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. అరకులోయ, పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలు శిబిరాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందని, రోగులకు విశాఖలోని శంకర్ ఫౌండేషన్‌కు చెందిన నేత్ర వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు జరుపుతారని, మందులు కూడా అందజేస్తారన్నారు. ప్రముఖ వైద్యులు సేవలందిస్తారన్నారు. ఆపరేషన్ అవసరమైన వారిని శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యవిభాగానికి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు జరిపిస్తామన్నారు. ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు తన 9441584695 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ లచ్చపాత్రుడు



కొయ్యూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో సీతయ్య




రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

చింతపల్లిరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ లచ్చపాత్రుడు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గిరిజనులకు ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంపై గిరిజనులకు అవగాహన కల్పించి వారందరు వైద్య శిబిరం జరిగేరోజు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో కార్యక్రమం తేదీలు నిర్ణయించి వెల్లడిస్తామన్నారు. లోతుగెడ్డ పీహెచ్ వైద్యాధికారి లక్ష్మికాంత్, ఐసీడీఎస్ సీడీపీవో రమణి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో లాలం సీతయ్య, తహసీల్దార్ తిరుమలరావు సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో భాగంగా వైద్య, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించి, యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.
ఎంఈవో జె.రాంబాబు, ఏవో బాలమురళీకృష్ణ, పీహెచ్‌సీల వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరీశ్వరరావు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుందన్నారు. ఎంపీడీవో ఒక టీమ్‌గా, తహసీల్దార్ సారథ్యంలో ఒక టీమ్‌గా గ్రామాల్లో పర్యటించి విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రాట మహోత్సవం



ఉత్సవ రాట వేస్తున్న భక్తులు

రాంబిల్లి : దిమిలిలో సోమవారం గణపతి నవరాత్రి ఉత్సవాల రాట మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు కె.టి. దీక్షితులు శాస్త్రోక్తంగా పూజలు చేసి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ నెల 18 న గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని దీక్షితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

స్తంభించిన నెట్‌వర్క్‌తో అవస్థలు

కొయ్యూరు: గడచిన రెండు నెలల నుంచి బీఎస్ఎన్ఎల్ సేవలు అధ్వానంగా తయారయ్యాయి. తరచూ సేవలు నిలిచిపోవడంతో అనేక కార్యాలయాలకు నెట్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నెట్ పనిచేయలేదు. నగదు కోసం బ్యాంకులకు వచ్చే వారు కష్టాలు పడుతున్నారు. ఇక్కడ నెట్ పనిచేయకపోవడంతో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోతున్నాయి. తరచూ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. సెల్ సిగ్నల్స్ గంటల తరబడి స్తంభించడంతో నానా అవస్థలు పడుతున్నామంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నకిలీ కుల ధ్రువీకరణ పత్రాల జారీ తగదు



అరకులోయలో నకిలీ కుల ధ్రువీకరణ పత్రం కాపీలను తగలబెడుతున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ రూరల్/డుంబ్రిగుడ: అరకులోయలో గిరిజనేతరుడుకి నకిలీ కుల ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయడంపై అరకులోయ, డుంబ్రిగుడలో గిరిజన సంఘం నాయకులు శనివారం ఆందోళన చేశారు. సంఘం నాయకులు బాలదేవ్, సూర్యనారాయణ మాట్లాడుతూ అర్హులైన గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రం జారీకి పలు నిబంధనలు చేస్తూ, ఓ గిరిజనేతరుడికి ఎస్టీ ధ్రువీకరణ పత్రాన్ని అధికారులు ఎలా జారీ చేశారని ప్రశ్నించారు. దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ కుల ధ్రువీకరణ పత్రాల జారీతో గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయకుండా చూడాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మగ్గన్న, సద్దు, గోపాల్, డొంబు , ప్రసాద్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎంపీపీ కుమారి

గూడెంకొత్తవీధి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఆమె అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందరికి అందాలని సూచించారు. అదే విధంగా గతంలో జగనన్న సురక్షలో ధ్రువీకరణపత్రాల కోసం దరఖాస్తులకు సంబంధించి పత్రాలు అందజేయాలన్నారు. దీనిపై గతంలో ఎంపీటీసీలు రామకృష్ణ, బుజ్జిబాబు, సీలేరు ఎంపీటీసీ సాం మూర్తి, ప్రస్తావించినట్టు చెప్పారు.నేటికి అనేక మందికి ఆయా సర్టిఫికెట్లు అందజేయలేదన్నారు. సీలేరులో రెండుకుటుంబాల పేరిట 16 మందిని అనర్హులుగా గుర్తించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు వారానికి రెండు రోజులు మాత్రమే వస్తున్నారని కో–ఆప్షన్ సభ్యుడు షేక్ దావూద్ తదితరులు తెలిపారు. దీనిపై స్పందించిన ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ గైర్హాజరవుతున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పనులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల వివరాలను ఎంపీపీ, జెడ్పీటీసీలకు తెలియజేయాలన్నారు. ఇప్పటి వరకు తెలియజేయకపోవడంపై ట్రైబల్ వెల్ఫేర్ జేఈ రఘురాంపై ఎంపీపీ కుమారి ఆగ్రహం చెందారు. ఏవో మధుసూదనరావు మాట్లాడుతూ సబ్సిడీపై అందిస్తున్న రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, తహసీల్దారు ప్రసాద్, సీడీపీవో లక్ష్మిదేవి, పీఆర్‌జేఈ జ్యోతిబాబు, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సోషల్ ఆడిట్



ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమైన ఎంపీడీవో నగేష్

అరకులోయ రూరల్: ఉపాధి హామీ పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ పారదర్శకంగా నిర్వహించనున్నట్టు ఎంపీడీవో నగేష్ తెలిపారు, మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఆయన ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 14 గ్రామ పంచాయతీ పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ సంయుక్తంగా రూ.25 కోట్లతో భూమి చదును, సీసీ, గ్రావెల్ రోడ్లు తదితర వివిధ రకాల అభివృద్ధి పనులు జరిగినట్టు చెప్పారు. గ్రామస్థాయిలో ఈనెల 12 నుంచి పారదర్శకంగా సోషల్ ఆడిట్ జరుగుతుందన్నారు. ఉపాధి పనులకు సంబంధించి సిబ్బంది అన్ని రకాల రికార్డులు సిద్ధం చేసుకోవాలన్నారు. ఏపీవో సత్యనారాయణ, ఈసీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పార్కు పనులను పర్యవేక్షించాలి



మంపలోని అల్లూరి విగ్రహం వద్ద వీరభద్రరావు

కొయ్యూరు: మంపలోని జరుగుతున్న అల్లూరి పార్కు పనులను జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి పార్కులో కేంద్రం నిధులతో జరుగుతున్న పనులను అధికారులు పర్యవేక్షించాలన్నారు. అల్లూరి నివాసం ఉన్న గాంధర్వ గుహను పునరుద్ధరించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. పవన్‌కుమార్, వెంకట సత్యనారాయణ, గంగాధర్‌రెడ్డి, రాము, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిపుత్రుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మురళీకృష్ణ

గూడెంకొత్తవీధి: గిరిపుత్రుడు మురళీకృష్ణ గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఏయూలో నిర్వహించి స్నాతకోత్సవంలో గూడెంకొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీ లింగవరానికి చెందిన గరిసింగి బాలమురళీకృష్ణ విద్యాశాఖ మంత్రి బొత్సతో పాటు గవర్నర్‌నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ కేశవ్ సారథ్యంలో ఆయన పీహెచ్‌డీ పూర్తి చేశారు. డాక్టరేట్ అందుకున్న మురళీ మాట్లాడుతూ పరిశోధనలకు డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందన్నారు.గవర్నర్‌తో పాటు విద్యాశాఖ మంత్రి స్థానిక ఎమ్మెల్యే,ఎంపీల ద్వారా పట్టా అందుకోవడం సంతోషాన్ని కలిగించిందన్నారు

మన్యంలో కానరాని బంద్

- కొనసాగిన ఆర్టీసీ, ప్రైవేట్ సర్వీసులు
- ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల కార్యకలాపాలు యథాతథం
- సాఫీగా సంతల్లో వ్యాపారం




ఎటపాకలో తిరుగుతున్న ఆర్టీసీ బస్సులు

రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపు విఫలమైంది. యథావిధిగా ప్రజా జీవనం కొనసాగింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడాన్ని నిరసిస్తూ టీడీపీ సోమవారం బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ బంద్‌ను మన్యంలో ప్రజలెవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, బ్యాంకులు యధావిధిగా పనిచేశాయి. ప్రజా రవాణా వ్యవస్థ సైతం ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ సర్వీసులు, ఆటోలు, జీపులు యధావిధిగా తిరిగాయి. వారపు సంతలో యధావిధిగా సాగాయి. కొన్నిచోట్ల టీడీపీ నాయకులు ర్యాలీలు నిర్వహించి, దుకాణాలు మూయించారు. కొన్ని చోట్ల టిఫిన్ సెంటర్లను టీడీపీ నాయకులు మూసివేయించడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు ఆకలితో ఇబ్బందులు పడ్డారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్, అల్లూరి

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని మొబైల్ ఐటీసీ కౌన్సిలర్ అర్జున్ కోరారు. అచ్యుతాపురం మండలం మార్టూరు, మడుతూరు గ్రామాల్లో సోమవారం ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని అలాగే గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 43 మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎల్‌టీ కిషోర్, లింక్ వర్కర్ బి.సత్యనారాయణ, సర్పంచ్ రమేష్‌బాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.